సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



రెవెన్యూకే మస్కా!

హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకుల నుంచి పాటదారుడు ఇంత వరకూ ప్రభుత్వానికి సొమ్ము చెల్లించకుండానే చెక్ పోస్టు పెట్టి టోల్ వసూలు చేస్తున్నాడు.

- 8లో



హోంగార్డుల సేవలు అభినందనీయం

హోంగార్డుల సేవలు అభినందనీయమని రాయలసీమ రీజినల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ అన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు.

- 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.140
రెండోరకం	రూ.100	రూ.150



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 40 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	600	600
సీబీ	530	670



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 51.580 కిలోలు

న్యూస్‌రీల్

ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల వివరాలు పొందుపరచాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మధుసూదనరావు

రాయచోటి: అసంఘటిత కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల వివరాలను పొందుపరచాలని డీఆర్‌ఓ మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో ఈ-శ్రమ్ పోర్టల్‌పై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితర అధికారులతో డీఆర్‌ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. 16 నుంచి 59 సంవత్సరాల వయస్సు కల్గిన కార్మికులు, ఇన్‌కమ్ ట్యాక్స్ కట్టనివారు తదితరుల వివరాలను ఈ-పోర్టల్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ జిల్లా అధికారి రంగరాజు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో ఏనుగుల బీభత్సం



టెంకాయ చెట్లను ఏనుగులు పెకలించి వేసిన దృశ్యం

సుండుపల్లె: అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం ముడుంపాడు పంచాయతీలోని నగిరి గ్రామంలో సోమవారం రాత్రి ఏనుగులు పంట పొలాల్లో బీభత్సం సృష్టించాయి. గ్రామంలోని గురిగింజకుంట వెంకటరమణ నాయుడుతో పాటు మరికొందరు రైతుల పొలాల్లో సాగు చేసిన ఉలవ పంట దెబ్బ తినగా, టెంకాయ చెట్లను ఏనుగులు వేర్లతో సహా పెకలించి వేశాయి. అంతేకాకుండా నీళ్ల కోసం వేసిన పైపు లైన్‌ను ధ్వంసం చేశాయి. అప్పులు చేసి అరకొరగా సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగులు ఇలా నష్టం చేయడంపై రైతులు లబోదిబోమంటున్నారు. బాధిత రైతుల సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు వచ్చి పంట నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

మల్లయ్యకొండ హుండీ ఆదాయం రూ.6.64 లక్షలు

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామికి హుండీ ద్వారా రూ.6.64 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈఓ మునిరాజ తెలిపారు. మంగళవారం ఆలయంలో కలికిరి,చింతపర్తికి చెందిన పరకామణి లెక్కించే వలంటీర్లు హుండీ కానుకలు లెక్కించారు. మూడు నెలల కాల వ్యవధిలో ఈ ఆదాయం వచ్చిందన్నారు.

అమ్మ క్యాంటీన్ భోజనమే బాగుంటుంది



అన్న క్యాంటీన్‌లో భోజనం నాణ్యతను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ప్రమీల

మదనపల్లె: అన్న క్యాంటీన్‌లో భోజనం కంటే తమిళనాడులోని అమ్మ క్యాంటీన్ భోజనం బాగుంటుందని తమిళనాడు వేలూరు జిల్లా గుడియాత్తంకు చెందిన వస్త్ర వ్యాపారి రమణ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఆకస్మిక తనిఖీల్లో భాగంగా పట్టణంలోని నీరుగట్టువారిపల్లె అన్న క్యాంటీన్‌ను మంగళవారం పరిశీలించారు. క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న తీరు, పరిశుభ్రత, తాగునీరు, ఇతర మౌలిక వసతులు అన్నింటినీ పరిశీలించారు. ఆహార నాణ్యత, పదార్థాల రుచి, వడ్డనపై భోజనం తింటున్న వ్యక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిద్దరు పర్లేదు..బాగానే ఉందని చెప్పారు. అయితే తమిళనాడుకు చెందిన వ్యాపారి రమణను అడిగితే, తమ వద్ద ఇలాగే అమ్మ క్యాంటీన్ పేరుతో కొన్నేళ్లుగా ఈ కార్యక్రమం నడుస్తోందన్నాడు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అతన్ని భోజనం మీ వద్ద బాగుంటుందా... మా వద్ద బాగుందా అని అడిగితే, అతడు నిర్మొహమాటంగా అమ్మ క్యాంటీన్ భోజనమే బాగుంటుందన్నాడు.

సడన్‌గా సమ్మర్!

ఫిబ్రవరి ప్రారంభం నుంచే సూర్యుడు నిప్పులు గక్కుతున్నాడు. క్రమక్రమంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అప్పుడే పగటిపూట రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. రానున్న రోజుల్లో భానుడి ప్రతాపాన్ని తట్టుకోవడం కష్టమేననే ఆందోళన వెంటాడుతోంది. వేసవి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధమవుతోంది.

- రెండు రోజులుగా భానుడి భగభగ
- ఫిబ్రవరిలోనే 35 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు
- ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి



రాజంపేట: వాయు కాలుష్యం..గ్లోబల్ వార్మింగ్ కారణంగా భూమి వేడెక్కుతోంది. భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. సడన్‌గా సమ్మర్ అన్నట్లుగా వేసవి ముందుగానే వచ్చేసింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రెండురోజులుగా భానుడు భగభగమంటున్నాడు. చలిక్రమంగా తగ్గుతోంది. సీజన్ మారిపోతోంది. తెల్లవారుజామున మాత్రం చలి తీవ్రత కనిపిస్తోంది. ఉదయం 8 గంటల తర్వాత పగటి ఉష్ణోగ్రతలు ప్రభావం చూపుతున్నాయి.

2024 వేసవిలో రికార్డు ఉష్ణోగ్రతలు..

2024 వేసవిలో 50 డిగ్రీల వరకు చేరువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేసవిలోనూ అంతే స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉంటాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. 2023లో ఆరునెలల సాధారణం కన్నా ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2024లో అయితే ఏడాదంతా సాధారణం కన్నా ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

- 1901 నుంచి సేకరిస్తున్న సమాచారం ప్రకారం 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించింది. ఈ ఏడాది సగటు ఉష్ణోగ్రత 0.65 డిగ్రీలు పెరిగింది. గత ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి మధ్యలో సాధారణం కన్నా 0.37 డిగ్రీలు పెరిగింది. ఈ ఏడాది జనవరిలో సగటు ఉష్ణోగ్రత 0.94 డిగ్రీలు ఎక్కువగా నమోదైంది. 1958లో గరిష్టంగా 1.17 డిగ్రీలు, 1990లో 0.97 డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరిగాయి.

ఈ నెలలోనే 35 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రతలు

ఈ నెలలో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు చేరువయ్యాయి. రెండురోజులుగా ఉక్కపోత మొదలైంది. సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఉక్కపోత మరింతగా పెరుగుతుందని వాతావరణశాఖ తెలిపింది.

సిద్ధమవుతున్న శీతల పానీయాల వ్యాపారులు

భానుడి భగభగలకు అప్పుడే ప్రజలు శీతలపానీయాలవైపు మొగ్గు చూపుతున్నారు. షరబత్, బత్తాయి, చెరుకు రసాలకు గిరాకీ పెరిగింది. తోపుడు బండ్లు రోడ్లపైకి వచ్చేశాయి. ఐస్‌క్రీం పార్లర్‌తో తమకు గిరాకీ ఉంటుందని సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే కర్బూజ, దోస కాయలు అప్పుడే మార్కెట్‌కు వచ్చేశాయి.

» జనవరి నుంచి..

జనవరి చివరివారం నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. 30 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలో కడప, రాయచోటి, బద్వేలు, పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రైల్వేకోడూరు తదితర ప్రాంతాల్లో ఉదయం వరకు మంచు కమ్మేసింది. 9గంటల తర్వాత భానుడి ప్రతాపం సాయంకాలం వరకు కొనసాగిన పరిస్థితులు చూశాం. ఆ పరిస్థితి ఇప్పుడు మారిపోయింది. ఇప్పుడు వేసవి ఛాయలు అలుముకుంటున్నాయి. ఈ సారి ఫిబ్రవరిలోనే ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు చేరువగా నమోదయ్యాయి.

ఇప్పటి నుంచే వేసవి జాగ్రత్తలు పాటించాలి



ఫిబ్రవరి మాసం తొలి నుంచి ఉష్ణోగ్రతలు పెరిగిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటి నుంచి ప్రజలు ముందస్తుగా ఆరోగ్యపరమైన చర్యలు చేపట్టాలి. మార్చిలో 50 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉంటాయని సమాచారం. కనుక ముందుగానే వేసవిలో ఎలాంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ దిశగా వైద్య ఆరోగ్యశాఖ అవగాహన కల్పించనుంది.

– డాక్టర్ కొండయ్య, డీఎంఅండ్‌హెచ్‌ఓ, అన్నమయ్య జిల్లా.

బరిలో నిలిచి.. పతకం గెలిచి..

- షూటింగ్‌బాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన యూసుఫ్
- ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం
- పల్లె నుంచి అంతర్జాతీయ స్థాయికి



గోల్డ్‌మెడల్‌తో మహమ్మద్ యూసుఫ్

మదనపల్లె సిటీ: మన దేశంలో ఇప్పుడిప్పుడు షూటింగ్‌బాల్ క్రీడకు ఆదరణ లభిస్తోంది. నేపాల్ దేశంలోఈ నెల 1 నుంచి 3 వరకు పోటీలు జరిగాయి. 3వతేదీ జరిగిన రెండవ ఆసియన్ షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్-2025 ఫైనల్స్ పోటీల్లో పాకిస్తాన్ జట్టుపై ఇండియా జట్టు విజేతగా నిలిచి ట్రోఫీ దక్కించుకుంది. అందులో అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన కుర్రాడు యూసఫ్ విశేష ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. భవిష్యత్తులో షూటింగ్‌బాల్ క్రీడలో రాణించి దేశ కీర్తి ప్రతిష్టలు నిలుపుతానని చెబుతున్నాడు.

- తంబళ్లపల్లెకు చెందిన స్టాంప్‌రైటర్ మస్తాన్‌వలీ, షాహినాబేగం కుమారుడు మహమ్మద్ యూసుఫ్. ప్రాథమిక విద్య తంబళ్లపల్లెలో, కాలేజీ విద్య మదనపల్లె బీటీ కాలేజీలో చదివాడు. ప్రస్తుతం ప్రొద్దుటూరులో బీపీఈడీ కోర్సు చేస్తున్నాడు. చిన్నప్పటి నుంచి షూటింగ్‌బాల్ క్రీడ అంటే ఇష్టం. గత నాలుగేళ్లుగా కోచ్‌లు నరేష్, మురళి, ఖాదర్‌బాషా, రెడ్డిశ్రీనివాస్‌ల వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. జిల్లా స్థాయి నుంచి రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగాడు. 2017 నుంచి షూటింగ్‌బాల్ రాష్ట్ర కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇప్పటి వరకు కర్నూలు, తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలతో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. ఆటల్లో ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు.

దాతల సహకారం

పేదరికం నుంచి వచ్చిన యూసుఫ్‌కు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్‌తో పాటు పలువురు దాతలు ముందుకు వచ్చి పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సహాయం అందించారు. దాతల ఆశీస్సులతో ఫైనల్స్ మ్యాచ్‌లో రాణించి అందరి మన్నలు పొందాడు. ఈ సందర్భంగా జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి, కార్యదర్శి గౌతమి నరేష్‌బాబు, ఉపాధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, సాగర్, కోశాధికారి సాయిశేఖర్‌రెడ్డి తదితరులు అభినందించారు.



ఇండియా టీంతో మహమ్మద్ యూసుఫ్

క్రీడా ప్రతిభను వెలికితీయాలి

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఘనంగా క్రీడా, సాంస్కృతిక సంబరం



క్రీడా పోటీల విజేతలతో వైస్ చాన్సలర్ ఆచార్య గోపాల్, ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే

రైల్వేకోడూరు అర్బన్: క్రీడా పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు దోహదపడతాయని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య గోపాల్ పేర్కొన్నారు. స్థానిక అనంతరాజుపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సంబరాలకు ముఖ్య అతిథులుగా వైస్ చాన్సలర్ గోపాల్, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 9 ఉద్యాన కళాశాలల్లోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉన్నప్పుడే చదువులో, క్రీడల్లో ఏకాగ్రత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఏ డాక్టర్ సూర్యకుమారి, అసోసియేట్ డీన్‌లు నాగరాజు, శ్రీనివాసులు, డాక్టర్ ప్రసన్నకుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, డాక్టర్ బీహెచ్ మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- పకడ్బందీగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



రాజంపేట: బ్రాహ్మణపల్లెలో మ్యుటేషన్ దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాజంపేట: భూ సమస్యలను రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. మంగళవారం రాజంపేట మండలం బ్రాహ్మణపల్లెలో మ్యుటేషన్ పరిష్కారం అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతకముందు ఎంపీడీఓ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కార అంశంపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన వినతులకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. మ్యుటేషన్ సమస్య విషయంలో చట్ట ప్రకారం ముందుకెళ్లాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంపై స్వయంగా పర్యవేక్షణ చేయాలని సబ్ కలెక్టర్ వైఖోమ్‌నైదియాదేవిని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల మేరకు విధి నిర్వహణలో నిక్కచ్చిగా పనిచేసినప్పుడు ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. రాజంపేట తహసీల్దార్ పీర్‌మున్నీ, ఆర్‌ఐలు, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ చేపట్టాలి

విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో నందలూరు, రాజంపేట మండల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. భవిష్యత్తులో పునర్ వ్యవస్థీకరణ విద్యార్థులకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. దీనివల్ల ఏ ఒక్క విద్యార్థికి, అలాగే ఉపాధ్యాయులకు నష్టం జరగకూడదన్నారు.సబ్‌కలెక్టర్ వైఖోమ్‌నైదియాదేవి, డీఈఓ సుబ్రమణ్యం, డిప్యూటీ డీఈఓ శివప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలపై సమీక్ష

రాయచోటి: రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను, పీజీఆర్‌ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంఆర్‌ఓలు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, రెవెన్యూ సదస్సుల అర్జీలు, పీఆర్‌జీలు, పీజీఆర్‌ఎస్ అర్జీలు, భూసేకరణ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదనరావు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, సర్వేశాఖ ఏడీ, ఎంఆర్‌ఓలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

వేంకటపతి.. జన హారతి

- జనసంద్రంలా దేవునికడప క్షేత్రం
- జిల్లా నలుమూలల నుంచి వెల్లువలా భక్తజనం



దేవుని కడపలో రథంపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి



ఒంటిమిట్ట రామాలయంలో వైభవంగా రథసప్తమి వేడుకలు

కడప కల్చరల్: ఇసుకేస్తే రాలనంత భక్తజనం మధ్య.. ఉవ్వెత్తున ఎగసిన ఆనందోత్సాహాల నడుమ .. కడప రాయుని రథం వైభవంగా కదిలింది. బ్రహ్మదేవుడు సారథ్యం వహించినట్లుగా అలంకరించిన రథం విశ్వతేజోమూర్తి సూర్యుని సాక్షిగా తేరు మేరు పర్వతంలా గంభీరంగా సాగింది. కడప రాయుని బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని నిర్వహించారు. దేవునికడప వీధులన్నీ జనంతో నిండిపోయాయి. మిద్దెలు, మేడలపై నుంచి కూడా భక్తులు రథంలోని దేవదేవుడిని తిలకించి పులకించారు.

కట్టలు తెగిన ఉత్సాహం

కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఉదయం స్వామి వారిని రథంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. ఆలయంలోని స్వామిని దర్శించుకోవడంతోపాటు తేరుపై కొలువుదీర్చిన దేవతామూర్తులను దర్శించుకునే అరుదైన అవకాశం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచి దేవునికడపకు రావడం మొదలైంది. ఈ సంవత్సరం అర్చకుల ప్రత్యేకమైన విన్నపంతో తేరు ముందు ప్రత్యేకమైన, విశాలమైన ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయడంతోపాటు ఎక్కువ మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకోగలిగారు. ఉదయం నుంచే సాగిన ఈ దర్శనాలు మధ్యాహ్నం ముగిశాయి. తొలుత రథాన్ని కొద్దిగా కదిలించిన నిర్వాహకులు శుభ ఘడియాల కోసం మరికొద్దిసేపు వేచి ఉండి ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు తొలి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చి రథాన్ని కదిలించారు. దేవునికడప, పాతకడప, మోడమీదిపల్లె యువత కట్టలు తెంచుకున్న ఉత్సాహంతో కదం తొక్కుతూ రథ చక్రాల కింద కొయ్య మొద్దులు వేసి వెదురు కర్రల సాయంతో ముందుకు కదిలించారు. ముందువైపు అశేష జనసందోహం పోటీలుపడి గొలుసులతో రథాన్ని లాగుతుండగా, మొక్కులు గల భక్తులు రథ చక్రాల కింద గుమ్మడికాయలను ఉంచి ఆ ముక్కలను ప్రసాదంగా స్వీకరించారు. అర్చకులు అడుగడుగునా రథంపై నుంచి ప్రజలకు స్వామి వారి హారతులిచ్చారు. భక్తుల గోవిందనామ స్మరణలతో దాదాపు నాలుగు గంటలపాటు దేవునికడప మార్మోగింది. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య మధ్యాహ్నం కదిలిన రథం మూడు గంటల పాటు మాడవీధుల్లో పయనించింది. అనంతరం ధూళి ఉత్సవం నిర్వహించారు. రథోత్సవానికి ఊహించనంత జనం భారీగా తరలివచ్చారు. స్వామి సేవకులు పలుచోట్ల శీతల పానీయాలు, అన్నదానాలు, అల్పాహారం అందజేశారు.



చిన్నారి నృత్య ప్రదర్శన

ఒంటిమిట్ట రామాలయంలో..

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా సీతారామ లక్ష్మణ మూర్తుల ఉత్సవ విగ్రహాలతో టీటీడీ వారు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు తొడిగి, తులసీ గజమాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు వీణా రాఘవాచార్యులు, వీణా మనోజ్ కుమార్‌లు మహా మంగళహారతి ఇచ్చి గ్రామోత్సవానికి బయలుదేరారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, టిటిడి సిబ్బంది పాల్గొన్నారు.



దేవుని కడపలో రథోత్సవంలో అశేష భక్తజనం

హోంగార్డు సేవలు అభినందనీయం

– సీమ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్



పరేడ్‌లో దిశా నిర్దేశం చేస్తున్న కమాండెంట్ మహేష్

రాజంపేట : హోంగార్డు సేవలు అభినందనీయమని రాయలసీమ రీజనల్ హోం గార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ పేర్కొన్నారు. మన్నూరు జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో రాజంపేట సబ్ డివిజన్ స్థాయి హోంగార్డ్స్ పరేడ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా, పోలీసు శాఖలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. హోంగార్డుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. బైకుపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఏడాదికోసారి మెడికల్ చెకప్ చేసుకోవాలని, ఆరోగ్య బీమా, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి వుండాలన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, విధులలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్ హోంగార్డ్స్ డీఎస్పీ కేవీ.ప్రసాద్, శ్రీనివాసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బంగ్లా శాఖ, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

A/C No's. 1) 38647805862 (H/L), 2) 39002592803 (Express Credit)

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

అనుబంధం చట్టం IV క్రింద- నిబంధన 8(1) మరియు (2)

క్రింది సంతకందారుడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బంగ్లా శాఖ, రాయచోటి, అన్నమయ్య జిల్లా కు అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలలోని నిబంధన 3తో చదువుకొనేలా సెక్షన్ 13(2) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని రుణగ్రహీత మరియు గ్యారంటారు అయిన శ్రీ పుల్లగూర రవి కుమార్, తండ్రి: పి. సాంబశివయ్య, డోర్.నెం.53/189-40, కె. రామాపురము, రాయచోటి, అన్నమయ్య జిల్లా వారికి తేదీ.08/11/2024 నాటి డిమాండు నోటీసు, తేది.01.12.2024నాటి పత్రికా ప్రకటనలో వివరించిన బకాయిలు మొత్తం 1. తేది.07.11.2024 నాటికి రూ॥19,62,864/- (అక్షరాల రూపాయలు పంతొమ్మిది లక్షల అరవై రెండు వేల ఎనిమిది వందల అరవై నాలుగు మాత్రమే) 2. తేది:07.11.2024 నాటికి రూ॥1,71,604/- (అక్షరాల ఒక లక్ష డెబ్బై ఒక్క వేల ఆరువందల నాలుగు మాత్రమే) తిరిగి చెల్లించవలసినదిగా నోటీసు ఇవ్వడమైనది. మీరు 08.11.2024 నుంచి గల భవిష్య వడ్డీ మొత్తాన్ని మరియు సంభవించే ఖర్చులు, కాస్ట్‌లు, ఛార్జీలు మొ॥గు వాటిని కూడా సదరు నోటీసు ఇచ్చిన తేది నుంచి గల 60 రోజులలోగా చెల్లించవల్సిందిగా తెలియజేయడమైనది.

ఋణగ్రస్తుడు/గ్యారంటారు డిమాండు నోటీసు నందు తెల్పిన మొత్తము బకాయి చెల్లించలేదు. అందువల్ల క్రింది సంతకందారుడు దిగువ వివరించిన ఆస్తిని, సదరు నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని సదరు ఆస్తిని తేది.30.01.2025న నిర్ణయాత్మక స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రస్తుడు/గ్యారంటారుకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఎవ్వరూ ఎలాంటి వ్యవహారం జరుపరాదని, ఒకవేళ ఎవ్వరైన సదరు ఆస్తి తో వ్యవహారం జరిపినచో భారతీయ స్టేట్ బ్యాంక్, బంగ్లా శాఖ, రాయచోటి, అన్నమయ్య జిల్లా వారి బకాయి మొత్తం 1. రూ॥19,62,864/- 2. రూ॥1,71,604/- మరియు ఒప్పంద రేటు ప్రకారం గల భవిష్య వడ్డీ మరియు ఖర్చులు, కాస్ట్‌లు, ఛార్జీలు మొ॥ వాటిపై తీసుకోనున్న చర్యలకు బాధ్యులగుదురని ముఖ్యంగా ఋణగ్రస్తుడు/ గ్యారంటార్లు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియచేయడమైనది.

తనఖా ఉంచిన స్థిరాస్తి వివరములు

కడప ఆర్.డి, రాయచోటి ఎస్.ఆర్.డి, రాయచోటి మున్సిపాలిటీ, రాయచోటి టౌన్, 9వ బ్లాకు, పూలతోట హరిజనవాడ, మాసాపేట గ్రామపొలము, అసెస్‌మెంట్ నెం.1121444844, డోర్.నెం.9/151-ఇ-1 నందు కల ఇంటిఆస్థి. రిజిస్టరు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.6574/2019, తేది:05.08.2019 ప్రకారము ఈ ఆస్తి పుల్లగూర రవికుమార్, తండ్రి: పుల్లగూర సాంబశివయ్యకు చెందినది.

Govt.Kuski, D.No: 4/1A1, A. 16.81 Cents Paiki 140 Sq.yards or 117.04 Mts

దీనికి హద్దులు: తూర్పు: మొక్కంటి కొండయ్య మరియు సాహెబ్ జాన్‌లకు చెందిన భూమి, పడమర: 12 అడుగుల వెడల్పుగల రోడ్డు, ఉత్తరము: పఠాన్ రజాక్‌ఖాన్‌కు చెందిన ఇల్లు, దక్షిణము: డోర్.నెం.9/151-బి నందు షేక్ మస్తాన్‌వలి కు చెందిన ఇల్లు. కొలతలు: తూర్పు-పడమర: 60 అడుగులు లేదా 18.29 మీటర్లు.

ఉత్తరము- దక్షిణము: 21 అడుగులు లేదా 6.40 మీటర్లు

గ్రౌండ్ ఫ్లోర్ కొలతలు: తూర్పు-పడమర:44' X 19' feet or 13.41 X 5.8 Mts

1వ ఫ్లోర్: తూర్పు-పడమర:24' X 10' feet or 7.32 X 3.04 Mts

మొత్తము విస్తీర్ణము: 60'X21' feet or 140 Sq.yards.

తేది: 30.01.2025 | సం/- అధీకృత అధికారి,

స్థలము: రాయచోటి. | స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

- హార్సిలీహిల్స్ టోల్ గేట్ లీజు రద్దు
- రూ.45.20 లక్షల సొమ్ము చెల్లించని పాటదారు
- అయినా 108 రోజులుగా టోల్ వసూలు
- స్వాధీనానికి తహసీల్దారుకు సబ్ కలెక్టర్ ఆదేశాలు

టోల్ వసూల్ రాజా



లీజుదారు వసూలు చేసే టోల్ ఫీజు ధరలు



వాహనదారులకు ఇచ్చే టోల్ రసీదులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకుల నుంచి టోల్ రుసుము వసూలుకు గతేడాది సెప్టెంబర్ 30న వేలంపాట నిర్వహించగా మదనపల్లెకు చెందిన వ్యక్తి రూ.45.20 లక్షల అత్యధిక వేలంతో లీజు దక్కించుకున్నాడు. అక్టోబర్ 18న అధికారికంగా ఏడాది పాటు టోల్ వసూలుకు రెవెన్యూ అధికారులు దగ్గరుండి అప్పగించారు. ఇంత వరకు అంతా బాగానే ఉన్నా అసలు విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది.

పైసా చెల్లించకుండా వసూళ్లు

టోల్‌ఫీజు వసూలుకు లీజు దక్కించుకున్న వ్యక్తి నుంచి వేలంపాట నిర్వహించిన రోజే పాటలో 10 శాతం నిధులు కట్టించుకోవాలి. లీజు మొదలైన తొలి నెలలో మరో 40 శాతం సొమ్ము చెల్లించి సబ్ కలెక్టర్‌తో ఒప్పందం చేసుకోవాలి. ఏడో నెలలో మిగిలిన 50 శాతం సొమ్ము చెల్లించాలి. దీనితో పాటదారు పాడిన సొమ్ము జమవుతుంది. ఇది కొన్నేళ్లుగా పాటిస్తున్న విధానం. అయితే పాటదారుడు ఇంత వరకూ సొమ్ము చెల్లించకుండానే చెక్ పోస్టు పెట్టి టోల్ వసూలు చేసుకుంటున్నారని బహిర్గతమైంది. వేలం పాట ముగిశాక టోల్ ఫీజు వసూలుకు సబ్ కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇస్తారు. దీని ఆధారంగా హార్సిలీ హిల్స్‌కు వచ్చే బైక్, వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు చేసుకుంటారు. పాటదారు ఇవేవీ లేకుండా వసూళ్లు ప్రారంభించారు. టోకెన్లు ముద్రించుకున్నాడు. దీనిపై తొలుత రెవెన్యూ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినా తర్వాత సైలెంట్ అయ్యారు.

స్వాధీనం చేసుకోండి

లీజు సొమ్ములో పైసా చెల్లించకపోవడంతో హార్సిలీహిల్స్ టౌన్ షిప్ కమిటీ చైర్మన్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ స్పందించారు. టోల్ వసూలు చేసుకుంటున్న లీజుదారుడిని వసూలు బాధ్యత నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిసింది. వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారని తెలిసింది. దీనిపై తహశీల్దారు మహమ్మద్ అజారుద్దీన్ దృష్టికి తేగా సబ్ కలెక్టర్ ఆదేశాలిచ్చారని టోల్ లీజుదారున్ని తప్పించి స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. లీజుదారు సొమ్ము చెల్లించలేదని చెప్పారు.

లక్షల్లో వసూళ్లు

గత ఏడాది అక్టోబర్ 18 నుంచి టోల్ సొమ్ము వసూలు చేసుకుంటున్న వ్యక్తి లీజు సొమ్ము చెల్లించలేదు. అయినా కొనసాగించిన అధికారులు ఇప్పటిదాకా వసూలు చేసిన సొమ్ము విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశమైంది. మంగళవారం నాటికి 108 రోజులుగా టోల్ వసూలు చేసుకుంటున్నారు. దీని ద్వారా లక్షల సొమ్ము వసూలైంది. ఇప్పుడు ఈ సొమ్మును తిరిగి రాబడతారా? లేక వదిలేస్తారా? అన్నదానిపై ఏమి జరుగుతుందో వేచి చూడాలి.

తొమ్మిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితులు, దుంగలను చూపుతున్న అధికారులు

సుండుపల్లె : అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ కె.సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ లింగాధర్‌ల బృందం స్థానిక ఎఫ్‌బీఓ అనిల్ కుమార్‌తో కలిసి సోమవారం నుంచి వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టిందన్నారు. మంగళవారం ఉదయం ఝరికోన వద్దకు చేరుకోగా అక్కడ కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకొని వెళ్తుండగా చుట్టుముట్టామని తెలిపారు. కొందరు పారిపోగా వెంబడించి ఆరు మంది తమిళ కూలీలను పట్టుకొని వారి వద్ద తొమ్మిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పారిపోయిన వారికోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. త్వరలోనే వారిని పట్టుకుంటామని ఆయన వెల్లడించారు. నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం డీ రమేష్ తెలిపారు.

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం



దళిత దీక్షకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి, ఎస్సీ, ఎస్టీలకు ద్రోహం చేస్తే, రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని కూల్చేస్తామని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివ ప్రసాద్ హెచ్చరించారు. బెంగళూరు రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద వీసీకే పార్టీ, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) నాయకులు సంయుక్తంగా 'దళిత దీక్ష' పేరుతో మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. గౌతమ బుద్ధుడి చిత్రపటం ముందు మోకరిల్లి త్రిశరణ, పంచశీల పఠించి శివప్రసాద్ దీక్ష ప్రారంభించారు. ఈ దీక్షకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా విశ్వనాథనాయక్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, వాల్మీకి మహాసేన వ్యవస్థాపకుడు నల్లబోతుల సుదర్శన్ బాబు, రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపకుడు కోనేటి దివాకర్, శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం అధ్యక్షుడు నరేంద్రనాయుడు తదితరులు సంఘీభావం ప్రకటించారు. నిసార్ అహ్మద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు టీడీపీ మోసపూరిత వాగ్దానాలు చేసి, గెలిచాక ఇచ్చిన హామీలు విస్మరించిందన్నారు. పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచాక కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని, ప్రజల్ని ఉద్యమాలకు సిద్ధం చేయడానికి దీక్షలు ప్రారంభించామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీతోపాటు, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, పల్లం తాతయ్య, టిఎ.పీర్‌బాషా, పెద్దపాలెం రవిశంకర్, సొన్నికంటి రెడ్డెప్ప, వై.చిన్నా, తలారికృష్ణ, బురుజు జనార్దన్, బురుజు రెడ్డిప్రసాద్, బైనేని సురేష్, చాట్ల కళ్యాణ్, నీరుగట్టి రాజేష్, వై.గంగాధర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి



చికిత్స పొందుతున్న ప్రసాద్

సిద్దవటం : మండలంలోని బాకరాపేట శివాలయం వద్ద సోమవారం రాత్రి నరేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో ఆలయంలో పనిచేస్తున్న ప్రసాద్‌పై కర్రతో దాడిచేశారని ఏఎస్ఐ సుబ్బరామచంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాకరాపేటలోని శివాలయంలో కూలి పనులు చేసుకునేందుకు నంద్యాల జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన ప్రసాద్ వచ్చారు. భాకరాపేట గ్రామానికి చెందిన నరేష్ మద్యం మత్తులో ప్రసాద్‌ను కర్రతో కొట్టడంతో గాయాలయ్యాయి. కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన వెంకటరమణ

సిద్దవటం : మండలంలోని సిద్దవటం-భాకరాపేట గ్రామాల మధ్య ఓబులమ్మ వంక సమీపంలో ద్విచక్ర వాహనాదారుడు మంగళవారం అదుపుతప్పి కింద పడడంతో గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. వేంపల్లికి చెందిన వెంకటరమణ ద్విచక్ర వాహనంలో బద్వేల్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. సిద్ధవంటం పెన్నానది వంతెన దాటి ఓబులమ్మ వంక వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో గాయాలయ్యాయి. 108 వాహనంలో కడప రిమ్స్‌సుపత్రికి తరలించారు.


స్కూల్ గేట్ పడి విద్యార్థికి...



ఘటనకు కారణమైన స్కూల్ గేట్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు ప్రభుత్వ పాథమిక పాఠశాలలో ప్రహరీ గేటు ప్రమాదవశాత్తూ పడడతో మతిన్(6) అనే విద్యార్థికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పాఠశాల నుంచి పిల్లలు ఇంటికి వెళ్లే సమయంలో విద్యార్థులంతా ఒక్కసారిగా గేటు వద్దకు ఎగ బడ్డారు. గేటును పక్కకు తోసే క్రమంలో వాలిపోయి విద్యార్థి మతిన్ తలపై బలంగా పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఉపాధ్యాయులు సదరు బాలుడిని తామే ఆసుపత్రిలో చికిత్స చేయిస్తామని చెప్పగా బాలుడి కన్నవాళ్ళు స్థానిక డాక్టర్ల సూచన మేరకు తల భాగంలో కుట్లు వేయాలని మెరుగైన వైద్యం కోసం బి.కొత్తకోట సీహెచ్‌సీకి వెళ్లాలని సూచించారు. గతంలోనూ రెండు సార్లు ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని, పిల్లల ప్రాణాలు పోయేవరకూ గేట్లను సరిచేయించే పనులు చేయరేమోననంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక దిబ్బలు పడి మరొకరికి...



గాయపడిన ఖాదర్‌వలి

మదనపల్లె : ఇసుక దిబ్బలు మీద పడి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రామసముద్రం మండలంలో జరిగింది. రామసముద్రానికి చెందిన అబ్దుల్ సాబ్ కుమారుడు ఖాదర్ వలి(45), ఎద్దుల బండిపై ఇసుక రవాణా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం యథావిధిగా ఇసుక తీసుకు వచ్చేందుకు బండిలో వెళ్లాడు. చెరువులో ఇసుక తవ్వుతుండగా, ప్రమాదవశాత్తూ ఇసుక దిబ్బలు మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రూ.50 కోసం యువకుడిపై కత్తితో దాడి

బద్వేలు అర్బన్ : రూ.50 కోసం ఓ యువకుడిపై ఆటో డ్రైవర్ కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి బద్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని మహబూబ్‌నగర్‌కు చెందిన ఖాజా రసూల్ ఓ వాటర్ ప్లాంట్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఖాజావలి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇరువురూ ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో తరచూ కలిసి మద్యం తాగేవారు. సోమవారం రాత్రి మద్యం తాగిన ఖాజావలి బస్టాండు సమీపంలో ఉన్న ఖాజా రసూల్ వద్దకు వెళ్లి రూ.50 ఇవ్వాలని అడిగాడు. తన వద్ద లేవని, మా అమ్మమ్మ కనిపించకపోవడంతో ఆమె కోసం తిరుగుతున్నానని చెప్పినా ఖాజావలి వినిపించుకోలేదు. కోపోద్రిక్తుడై తన ఆటోలో చాకు తీసుకుని ఖాజారసూల్‌పై దాడి చేశాడు. రసూల్‌కు స్వల్ప గాయాలవడంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

తలనీలాల వేలం వాయిదా

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లి అడవుల్లో వెలసిన నిత్యపూజస్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల వేలం పాటను ఈ నెల 7వతేదీకి వాయిదా వేసినట్లు ఆలయం ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంపాటలో ఐదుగురు పాటాదారులు లక్ష రూపాయలు చెల్లించి పాటలో పాల్గొన్నారన్నారు. రూ. 3.30 లక్షల వరకు వేలం కొసాగి ఆగిపోవడంతో ఈ నెల 7వతేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనార్దన్, చంద్ర, వెంకటసుబ్బారెడ్డి, పాటదారులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై సౌమ్యనాథుడు



సూర్యప్రభ వాహనంపై సౌమ్యనాథస్వామి

నందలూరు : జిల్లాలో వైష్ణవ క్షేత్రంగా పిలవబడే సౌమ్యనాథస్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఈఓ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో సౌమ్యనాథ స్వామిని సూర్యప్రభ వాహనంపై మాడ వీధులలో ఊరేగించారు. స్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున రావడంతో ఆలయం కిక్కిరిసి పోయింది. రాత్రి చంద్రప్రభ వాహనంపై కృష్ణమూర్తి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మోకాళ్లపై ఉద్యోగుల నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఓబులవారిపల్లె : ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించిన తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీఎండీసీ పాఠశాల సిబ్బంది మోకాళ్లపై నిలబడి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని వారం రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా, ఏపీఎండీసీ యాజమాన్యం స్పందించలేదన్నారు. వెంటనే సబ్ స్టాఫ్‌ను వెంటనే వీధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేకాట స్థావరంపై దాడి

బి.కొత్తకోట: మండలంలోని గుడిపల్లి వద్ద మధుకర్‌రెడ్డి మామిడి తోటలో పేక ముక్కల జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన డి.విశ్వేశ్వర్‌రెడ్డి, జి.సుదర్శన్‌రెడ్డి, డి.రాజేశ్వర్‌రెడ్డి, బి.చిన్నికృష్ణ, డి.రామలింగారెడ్డి, ఎం.రాజన్న, మరికొందరిని అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి నుంచి రూ.1,30,720 నగదు, ఐదు బైక్‌లు, ఎనమిది ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఉరికి వేలాడిన రైతు

మృతిపై అనుమానంతో పోలీసులకు కుటుంబీకుల ఫిర్యాదు



నరసింహులు (ఫైల్)

మదనపల్లె : పొలంలో చెట్టుకు ఉరికి వేసుకుని రైతు మృతిచెందారు. ఆయన మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబీకులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మదనపల్లె మండలంలోని పిచ్చలవారిపల్లికి చెందిన వెంకటప్ప కుమారుడు నరసింహులు(60)కు ఊరి సమీపంలో పొలం ఉంది. గత కొన్నేళ్లుగా పంట సాగు చేస్తూ వచ్చిన ఆయనకు సమస్య ఎదురైంది. తన పొలానికి దారి సమస్య ఉండడంతో అదే గ్రామానికి చెందిన రెడ్డెప్ప పొలం నుంచి వెళ్లాల్సి ఉంది. అయితే రెడ్డెప్ప ఇటీవల వెళ్లడానికి అంగీకరించకపోవడంతో పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు స్పందించకపోవడంతో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. అనంతరం ఇంటికి వచ్చిన ఆయన రాత్రి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా.. అలనేరేడు చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. కుటుంబీకుల సమాచారంతో సీఐ కళావెంకటరమణ చేరుకుని ఘటనకు గల కారణాలు కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. తన భర్తకు 62 ఏళ్ల వయస్సు ఉందని, చెట్టు ఎక్కలేడని, ఉరి వేసుకునే ధైర్యం కూడా లేదని, తన భర్త మరణంపై తనకు అనుమానం ఉందని మృతుడు నరసింహులు భార్యర రెడ్డెమ్మ అనుమానం వ్యక్తం చేసింది. పొలం దారి సమస్య కారణంగానే తన భర్త దక్కకుండా పోయారని విలపించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి కుమార్తె రమణమ్మ, కుమారుడు మోహన్‌బాబు, అనిల్‌కుమార్ ఉన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో అధికారులు

చిట్వేలి : సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్తు బిల్లు తగ్గించుకోవచ్చని రాజంపేట ట్రాన్స్‌కో డీఈ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై స్థానిక పంచాయతీ కార్యాలయంలో వినియోగదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. డీఈ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ బ్యాంకు రుణం పొందే విధి విధానాలను వివరించారు. ఏడీ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ కిలో వాట్‌కు రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60 వేలు, 3 కిలో వాట్లకు రూ.78 వేలు ప్రభుత్వం రాయితీగా ఇస్తుందన్నారు. పదిశాతం రుణగ్రహీత చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటాచలపతి, వినియోగదారులు పాల్గొన్నారు.

ఉరేసుకొని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైష్ణవి మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని నంగనూరుపల్లెలో బీటెక్ విద్యార్థి మేకల వైష్ణవి(19) ఉరేసుకొని మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. వైష్ణవి సీబీఐటీ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొన్నేళ్లుగా కడుపు నొప్పి రావడంతో యువతి తీవ్రంగా బాధపడుతూ ఉండేది. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి చూపించినా నయం కాలేదు. వైష్ణవి మంగళవారం కాలేజీకి వెళ్లలేదు. వైష్ణవి తల్లి, సోదరుడు ఉదయాన్నే ట్రాక్టర్ తీసుకొని పెన్నానదిలోకి ఇసుక కోసం వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోనే పైకప్పుకు చీరతో ఉరేసుకుంది. ఎస్ఐ సురేష్ గ్రామానికి వెళ్లి జరిగిన ఘటనపై విచారించారు. తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బోరున విలపించిన స్నేహితులు

పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కడసారి తమ స్నేహితురాలిని చూసేందుకు పెద్ద ఎత్తున వైష్ణవి సీబీఐటీ కళాశాల విద్యార్థులు తరలి వచ్చారు. మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. తమ స్నేహితురాలు వైష్ణవి చదువులో టాపర్ అని, చనిపోవడం బాధగా ఉందని రోదించారు.

విదేశీ బీమా కంపెనీలతో దేశ భద్రతకు ముప్పు



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

కడప కల్చరల్ : విదేశీ బీమా కంపెనీలు దేశ భద్రతకు ముప్పు అని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నేత రఘునాథరెడ్డి అన్నారు. డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ ప్రకటించిన మేరకు బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని 100 శాతానికి పెంచడం తగదన్నారు. విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను నేరుగా ఆహ్వానించడంతో బీమా రంగానికి, పాలసీదారులకు మేలు చేయదని తెలిపారు. పాలసీదారులకు సకాలంలో మొత్తం చెల్లిస్తూ దేశాభివృద్ధికి నిధులను అందిస్తున్న ఎల్ఐసీకి స్వయం ప్రతిపత్తి ఇవ్వాల్సి ఉందన్నారు. పార్లమెంటులో ఎఫ్‌డీఐని పెంచుతూ బీమా చట్ట సవరణ బిల్లు తీసుకువస్తే సమ్మెకైనా వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ల నేతలు సుధీకర్, నిత్యానంద రెడ్డి, అక్బర్‌బాషా, వసుప్రద, పారిజాతమ్మ, రత్నకిషోర్, జె.రఘు శ్రీనివాస్ కుమార్, జయచంద్ర, అప్పయ్య, చిన్నయ్య, శ్రీనివాసులు, యల్లయ్య, ఉద్యోగులు, పెన్షనర్లు, ఏజెంట్లు పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంచాలని విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పశువైద్య కళాశాల విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : తమకు స్టైఫండ్ పెంచాలని కోరుతూ మండలంలోని గోపవరం సమీపంలోని పశు వైద్య కళాశాల విద్యార్థులు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. పశు వైద్య కళాశాల నుంచి గోపవరం గ్రామంలోని జెండా చెట్టు వరకు ర్యాలీ చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ 2013 నుంచి ఇప్పటివరకూ తమ స్టైఫండ్ కేవలం రూ.7వేలు ఇస్తున్నారన్నారు. నిత్యావసర ధరలు పెరిగినా స్టైఫండ్ పెరగలేదని, ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కరించేంత వరకు రోజూ నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది పశువైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.